ఈనాడు
నల్గొండ
ఆదివారం సెప్టెంబరు 29, 2024

ఉత్సాహంగా జానపద నృత్యాలు


ప్రదర్శన ఇస్తున్న కేజీబీవీ తిరుమలగిరి సాగర్ విద్యార్థినులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నల్గొండలో విద్యార్థులకు జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించారు. నల్గొండలోని స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలకు 26 పాఠశాలల నుంచి 172 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ జానపద పోటీల్లో కేజీబీవీ కట్టంగూరు కు చెందిన వైష్ణవి బృందం ప్రథమ బహుమతి, కేజీబీవీ తిరుమలగిరి సాగర్‌కు చెందిన ఆర్.సంధ్య బృందం ద్వితీయ, జి.ప.ఉ.పా దోమలపల్లికి చెందిన కావ్య బృందం తృతీయ బహుమతి సాధించారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతి మాట్లాడారు. జిల్లా సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ సంప్రదాయం పాటించాలి

నీలగిరి, న్యూస్‌టుడే: దేవాలయాల్లో నిత్య పూజలు ఆలయ సంప్రదాయం పాటిస్తూ నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నెపర్తి సులోచన సూచించారు. దేవాలయ శాఖ పరిధిలోని ధూప దీప నైవేద్యం పథకం పరిధిలో పని చేస్తున్న ఆలయ అర్చకుల సమావేశంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. నిత్య పూజలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ భక్తుల మన్ననలు పొందాలని సూచించారు. ఆలయాల్లో ఏవైనా నిర్మాణాలు తదితర కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ధూప దీప నైవేద్య పథకం అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవ శర్మ, జిల్లా అధ్యక్షులు పగిడిమర్రి ప్రసాద్ శర్మ, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు చలివేదుల రాజేశ్వర శర్మ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అన్నాబోట్ల ఫణి కుమార్ శర్మ, జనగామ జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్‌శర్మ, పోతుల పాటి రామలింగేశ్వర శర్మ, జి.లక్ష్మీనర్సయ్య శర్మ, హరికీర్తి అమరేశ్వర శర్మ, లక్ష్మీ, సుమతి, జ్యోతి ,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం


నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ మిషన్ పరివర్తన్ అనే నూతన కార్యక్రమంతో గ్రామ స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి తాగుతూ పట్టుబడిన 327 మందిని అదుపులోకి తీసుకుని మానసిక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 31 కేసులలో 131 మందిని జైలుకు తరలించి రూ.1.90 కోట్ల విలువగల 771 కిలోల గంజాయి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసినప్పుడే గుర్తింపు: ఎంపీ

చింతపల్లి, న్యూస్‌టుడే: నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్‌లు అన్నారు. శనివారం మండలంలోని నెల్వాలపల్లిలో బూర్గు పెద్దమల్లయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెద్దమల్లయ్య బాల్యం నుంచి కష్టపడి వ్యాపారవేత్తగా ఎదిగారని అన్నారు. ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి నిస్వార్థంగా సేవ చేశారని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, నాగభూషణం, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.


నెల్వాలపల్లిలో బూర్గు పెద్దమల్లయ్య విగ్రహావిష్కరణలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

చింతపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పెద్దమల్లయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శనివారం రాత్రి హాజరయ్యారు. ఆయన కుటుంబ సభ్యులు గ్రామంలో స్వచ్ఛందంగా సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, చెనమోని రాములు, రమేష్ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

పోలీస్



అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగ ప్రకటన జారీలో జాప్యం కొనసాగింది. ఇతర శాఖల మాదిరిగా కాకుండా పోలీసు శాఖలో తరచూ నోటిఫికేషన్లు వెలువడేవి. ఉత్తమమైన మార్కులు లేకున్నా సగటు డిగ్రీ విద్యార్థి కూడా మైదానంలో ఒళ్లువంచి కష్టపడితే పోలీసు ఉద్యోగం లభించే పరిస్థితులు ఉండేవి.

సుమారు 15 ఏళ్ల క్రితం జిల్లాలో తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం, పరిశ్రమల స్థాపన కూడా అంతంత మాత్రమే కావడం, జిల్లాలో కొంతమేర వ్యవసాయరంగం సానుకూలంగా ఉండటం, మరికొంత మేర కరవు తాండవించడం, ముఖ్యంగా రైతు కుటుంబాలు ఆర్థికంగా బలంగా లేకపోవడం వంటి సామాజిక స్థితిగతులు జీవితంలో ఏదో ఒక ఉద్యోగాన్ని సాధించాలనుకునే యువతకు పోలీసు ఉద్యోగాలు ఒక మహదవకాశంగా కనిపించాయి.

వామపక్ష రాజకీయాల ప్రభావంతో యువతలో అన్యాయాన్ని ధిక్కరించే ధోరణి అలవడింది. దీంతోపాటు వారిలో సేవా దృక్పథం కూడా ఉండటం కూడా పోలీసు ఉద్యోగాల వైపు వారు దృష్టి సారించే పరిస్థితులు కలిగాయి.

1980ల ప్రారంభం నుంచి సుమారు 2005 వరకు జిల్లాలో వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు అధికంగా ఉండేవి. జిల్లాలో నిరుద్యోగ యువత అటువైపు ఆకర్షితులు కాకుండా పోలీసు ఉద్యోగాల వైపు యువతను ఆకర్షించడానికి ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు వెలువరించేది. ఉద్యోగార్థుల్లోని ఔత్సాహికులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కూడా ఇచ్చేవారు. ఇష్టంతో పోలీసు శాఖలోకి వెళ్లిన వారు తమ కుటుంబాలకు దన్నుగా నిలిచారు.

జీవితంలో త్వరగా స్థిరపడాలని..



డిగ్రీ పూర్తి చేయగానే కుటుంబ పరిస్థితుల రీత్యా ఏదో ఒక ఉద్యోగం సాధించి, కుటుంబానికి అండగా నిలబడటంతో పాటు జీవితంలో త్వరగా స్థిరపడాలనే ఆలోచనతోనే తాను పోలీసు ఉద్యోగాన్ని ఎంచుకున్నానని చెపుతున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకికి చెందిన **షేక్ జహంగీర్.** ఆయన ప్రస్తుతం దక్షిణ మండల అదనపు డీసీపీ, హైదరాబాద్ సిటీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1990లో కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణలో ఉండగానే ఎస్సై పోస్టుకు పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. 2007లో సీఐగా, 2017లో డీఎస్పీగా, 2023లో అదనపు డీసీపీగా పదోన్నతి పొందారు. ఆవేశంతో పాటు ఆలోచనపరులుగా ఉండే జిల్లా వాసుల్లో సామాజిక స్పృహ సహజంగానే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అవసరం..అభిమానం..



తన కుటుంబ పరిస్థితులతో పాటు ఆ శాఖపై ఉన్న అభిమానం తనను పోలీసు ఉద్యోగం వైపు మళ్లించాయని తెలిపారు నల్గొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తికి చెందిన **జాల మల్లేశ్.** ఆయన ప్రస్తుతం రాష్ట్ర ఆక్టోపస్ విభాగంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పేద కుటుంబం కావడంతో ఎస్టీడీ బూత్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ డిగ్రీ పూర్తి చేశారాయన. చిన్నప్పటి నుంచి ఏదైనా సాధించాలని, అది నలుగురిలో ఒకరిగా కాకుండా ప్రత్యేకంగా ఉండాలని కోరుకునే వాడినని మల్లేశ్ పేర్కొన్నారు. 2007లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై, 2009లో రిజర్వ్ ఎస్సైగా ఎంపికై ఆక్టోపస్‌కు వెళ్లానని, 2017లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి (హైదరాబాద్) లభించిందన్నారు.



- చిట్యాల, న్యూస్‌టుడే

విద్యుత్తు సంస్థలో ఉద్యోగుల బదిలీల కసరత్తు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ నల్గొండ జిల్లా పరిధిలో ఉద్యోగుల బదిలీల కసరత్తు ప్రారంభమైంది. విద్యుత్తు సంస్థ ఆదేశాల మేరకు రెండేళ్ల పాటు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగుల సీనియారిటీ జాబితాను శనివారం విడుదల చేశారు.

❒ నల్గొండ సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగులతో పాటు, నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్ల పరిధిలో రెండేళ్లకు పైబడి ఒకే చోట పని చేస్తున్న ఉద్యోగుల్లో 50 శాతం మంది ఉద్యోగులకు స్థానచలనం లభించనుంది.

❒ నల్గొండ సర్కిల్ కార్యాలయంలో సబ్ ఇంజినీర్లు- 30, జేఏవో- 22, సీనియర్ అసిస్టెంట్లు- 32, జూనియర్ అసిస్టెంట్లు- 41, ఫోర్‌మెన్స్- 05, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టరు- 02, రికార్డు అసిస్టెంట్లు- 05 చొప్పున బదిలీ కానుండగా.. డివిజన్ల పరిధిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు- 34, లైన్‌మెన్లు- 126, అసిస్టెంటు లైన్‌మెన్లు- 30, జూనియర్ లైన్ మెన్-1, స్కావెంజర్లు-03 చొప్పున మొత్తం 331 మంది ఉద్యోగులు బదిలీ కానున్నారు.

❒ ఏఈ, ఏడీఈ, డీఈలకు రాష్ట్ర స్థాయిలో బదిలీలు పూర్తయిన తర్వాత జిల్లాలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని ధర్నా

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంపద సృష్టిస్తున్న కార్మికులకు, సేవలందిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వాలు కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నాయని అన్నారు. సౌకర్యాల సాధనకు ఈ నెల 30న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఎదుట ధర్నాకు జిల్లా నుంచి అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని కోరారు. దండంపల్లి సత్తయ్య, సత్యనారాయణ, ముత్యాలు, మల్లయ్య, నగేష్, స్వామి, శ్రీనివాస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఒప్పంద, పొరుగు సేవ కార్మికులు

సర్టిఫికెట్లు ధ్రువీకరించుకున్న 124 మంది అభ్యర్థులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 బాధిత ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల ధ్రువీకరణ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుంది. మొదటి రోజు ఈనెల 27న 96 మంది అభ్యర్థులు ధ్రువీకరణకు హాజరు కాగా, రెండోరోజు 28 మంది అభ్యర్థులు ధ్రువీకరణకు హాజరయ్యారు. ఇప్పటి వరకు మొత్తం 124 మంది సర్టిఫికెట్లు ధ్రువీకరణ చేయించుకున్నారు.

1న డీఈఈసెట్-2024 సర్టిఫికెట్ల ధ్రువీకరణ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఈఈ సెట్-2024 నందు ర్యాంకు సాధించిన ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన అర్హత కలిగిన అభ్యర్థులు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో 2024-2026 బ్యాచ్‌లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అర్హత సాధించి ఆగస్టు నెలలో నిర్వహించిన సర్టిఫికెట్ల ధ్రువీకరణకు హాజరు కాని వారికి అక్టోబరు 1న సర్టిఫికెట్ల ధ్రువీకరణ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ నల్గొండ ప్రధానాచార్యులు కానుగుల నర్సింహ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, హాల్ టికెట్, డీఈఈసెట్ ర్యాంకు కార్డు, పదో తరగతి, ఇంటర్ మెమోలు, టీసీ, 4 నుంచి 10 తరగతుల బోనాఫైడ్, కులం, ప్రస్తుత వార్షిక సంవత్సరం ఆదాయ ధ్రువపత్రం తదితర ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు. బీసీలకు రూ.లక్ష లోపు, ఎస్సీలకు రూ.2లక్షల లోపు ఆదాయం ఉన్నవారు ధ్రువపత్రాలు తీసుకురావాలని, లేని పక్షంలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

సత్వర న్యాయమే లోక్ అదాలత్‌ల ధ్యేయం

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పని చేస్తున్నదని ఆ సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను శనివారం ప్రారంభించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవనంలో ఆయన కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడారు. కక్షిదారులకు సత్వర న్యాయ సహాయం అందించేందుకు త్వరితగతిన కేసులను పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 4,530, సివిల్ కేసులు 71, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు 120, బ్యాంకు కేసులు 24, సైబర్ నేరాల కేసులు 38, ట్రాన్స్‌కో కేసులు 318, ట్రాఫిక్ చలాన్ కేసులు, ఇతర కేసులు 16,830 పరిష్కారం అయ్యాయి. మోటారు వాహన ప్రమాద బీమా కేసులలో నష్ట పరిహారంగా రూ.20.26 లక్షలు చెల్లించేందుకు బీమా కంపెనీలు రాజీ కుదుర్చుకున్నాయి. న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బండి దీప్తి, న్యాయమూర్తులు సంపూర్ణ అనంద్, రోజా రమణి, కవిత, దుర్గాప్రసాద్, తేజోకార్తిక్, శిరీష, సౌందర్య, బార్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి, లింగయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించిన జిల్లా జడ్జి నాగరాజు, ఇతర న్యాయమూర్తులు

పంచాయతీ ఓటరు తుది జాబితా విడుదల

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఓటరు తుది జాబితాను జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం శనివారం విడుదల చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొన్ని రోజులుగా పంచాయతీల్లో వార్డుల వారీగా కార్యదర్శుల ఆధ్వర్యంలో జాబితాను రూపొందించారు. తొలుత ఈ నెల 13న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఆ తర్వాత ఈ నెల 18 వరకు అభ్యంతరాలు స్వీకరించి 26వ తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచాయతీలతో మొత్తం 868 పంచాయతీల్లో 7,482 వార్డులు ఉండగా ఇందులో 856 పంచాయతీల్లోని 7,392 వార్డులకు సంబంధించిన జాబితాలను అధికారులు వెలువరించారు. మిగతా 12 పంచాయతీల్లోని 90 వార్డుల్లో మార్పులు చేయాల్సి కారణంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాబితాను నిలిపివేశారు. 856 గ్రామ పంచాయతీలతో పాటు ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్డీవో, డీపీవో కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో ఓటరు తుది జాబితాలను ప్రదర్శించారు. జిల్లాలో 10,42,545 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 5,16,713 మంది పురుషులు కాగా 5,25,780 మంది మహిళలున్నారు. 52 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా తొమ్మిది వేల మంది ఉన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలకు సంబంధించి వార్డుల పునర్విభజన జరిగినందున త్వరలో ఆయా వార్డుల్లోను ఓటరు జాబితాను ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. పంచాయతీ ఎన్నికల ప్రకటన జారీ అయ్యే వరకు ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు అభ్యంతరాలను స్వీకరించి పొందుపర్చడం జరుగుతుందని పంచాయతీ అధికారులు వివరించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్స్ అయిన 1. శ్రీమతి పానగంటి ప్రథమలక్ష్మి, భర్త: రామాచారి మరియు 2. శ్రీమతి సోల్లేటి రజిత, భర్త: నర్సింహ్మాచారి, ఇరువురి నివాసం: మిర్యాలగూడ గారలు షెడ్యూల్‌లోని ఆస్తిని దాని యజమాని అయిన శ్రీమతి చిల్లంచర్ల సోమలక్ష్మి, భర్త: లేట్ అనంతరాములు, నివాసం: మిర్యాలగూడ గారి నుండి ఖరీదు చేసి, కొంత మొత్తం బయానాగా చెల్లించి, విక్రయ అగ్రిమెంటు కూడా పొందియున్నారు. సదరు షెడ్యూల్‌లోని ఆస్తి శ్రీమతి చిల్లంచర్ల సోమలక్ష్మి గారికి రిజిష్టర్డ్ కొనుగోలు దస్తావేజు నెం. 1870/1982 ద్వారా కొంత అనగా సర్వే నెంబర్లు 727 నుండి 730 మింజుంలే లోని ప్లాట్ నెంబరు 50లో 484 చదరపు గజాలను మరియు మిగిలిన కొంత అనగా సదరు సర్వే నెంబరులోని ప్లాట్ నెంబరు 51లో 60 1/2 చదరపు గజములను రిజిష్టర్డ్ కొనుగోలు దస్తావేజు నెం. 419/1984 ద్వారా శ్రీ లింగాల ప్రకాశలింగం, తండ్రి: భాగ్యలింగం, నివాసం: హైద్రాబాద్ గారి నుండి ఖరీదు చేసినారని సదరు స్థలాన్ని శ్రీ లింగాల ప్రకాశలింగం మరియు శ్రీ పూటుకూరు సత్యనారాయణ రెడ్డి, తండ్రి: దుర్గారెడ్డి, నివాసం: మిర్యాలగూడ గారల ఉమ్మడిగా రిజిష్టర్డ్ కొనుగోలు దస్తావేజు నెం.738/1972 ద్వారా భూమి పట్టేదారైన శ్రీ అనరెడ్డి రాఘవరెడ్డి, తండ్రి: వీరారెడ్డి, నివాసం: మిర్యాలగూడ గారి నుండి ఖరీదు చేసి తదుపరి నోటి మాటల ద్వారా విభాగాలు చేసుకోగా షెడ్యూల్‌లోని ఆస్తి శ్రీ లింగాల ప్రకాశ లింగం గారి వాటాకు సంక్రమించినదని తెలియజేయుచున్నారు. సదరు దస్తావేజులన్నీయు మిర్యాలగూడ సబ్- రిజిస్ట్రార్ కార్యాలయమునకు చెందినవి.

ఇట్టి కొనుగోలు వ్యవహారములో ఎవరికైనా ఏవైనా అభ్యంతరములు అనగా తాకట్టులు, విక్రయ అగ్రిమెంటులు, కోర్టు అటాచ్‌మెంటులు, చట్టరీత్యా ఏమైనా హక్కులు వగైరాలు ఏమైనా ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (7) రోజులలో ఈ క్రింది అడ్రస్‌లో నాకు తెలియజేయగలరు. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు పరిగణలోనికి తీసుకొనబడవు. గడువు లోపల ఎలాంటి అభ్యంతరములు రాని యెడల నా క్లయింట్లు ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి, సదరు కొనుగోలు వ్యవహారంలో మిగతా డబ్బు చెల్లించి క్రయమగు రిజిష్టర్డ్ దస్తావేజు చేయించుకొనెదరు.

షెడ్యూలు

నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, మిర్యాలగూడ పట్టణ మున్సిపల్ పరిధిలోని బ్లాక్ నెంబరు 19 యందలి రెడ్డి కాలనీలోని సర్వే నెంబర్లు 727, 728, 729 మరియు 730 మింజుంలే ప్లాట్ నెంబర్లు 50 మరియు 51లోని ఇంటి నెంబరు 19-154 యొక్క విస్తీర్ణము 544.50 చదరపు గజములు.

ఇట్టి ఆస్తికి హద్దులు: తూర్పు: 24 అడుగుల రోడ్డు, పడమర: చిల్లంచర్ల జానకమ్మ గారి గృహము, ఉత్తరం: పూటుకూరు సత్యనారాయణరెడ్డి గారి కాంప్లెక్స్, దక్షిణం: 30 అడుగుల రోడ్డు.

తేది: 29-09-2024
స్థలం: మిర్యాలగూడ

సం/- నాగుబండి శ్రీనివాస్, బి.ఎ.,బి.ఎల్
ఇ.నెం. 28-751, సబ్ జైల్ దగ్గర, విద్యానగర్, మిర్యాలగూడ - 508 207, ఫోన్:98491 35332

సారస్వత పరిషత్తు సాహితీ పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేష కృషి చేసిన ఎనిమిది మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు ప్రకటించింది. ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్మహేకు బహూకరించనున్నారు. ఆచార్య పాకాల యశోదారెడ్డి అవార్డును డాక్టర్ భాస్కరాయోగికి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సాహిత్య పురస్కారాన్ని మొత్కూరి నరహరికి, డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని ఆచార్య ఎన్ భక్తవత్సలరెడ్డికి, ఆలూరి బైరాగి కవితా పురస్కారాన్ని నాగవరం బాలరామ్‌కు, డా.వానమామలై వరదాచార్యుల పురస్కారాన్ని డాక్టర్ వెల్దండ సత్యనారాయణకు, ఆచార్య రావికంటి వసునందన్ సాహితీ పురస్కారాన్ని రేడియం (జె.కొండన్న)కు, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని పురస్కారాన్ని డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యకు అందజేయనున్నారు. వచ్చే నెల 4న సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ బొగ్గులకుంటలోని పరిషత్ ప్రాంగణంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.



RAMOJI FILM CITY

సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

నాటి విద్యార్థి.. నేడు ప్రధానోపాధ్యాయుడు



సుంకోజు భాస్కర్

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మదిర గ్రామం మల్లేపల్లికి చెందిన సుంకోజు భాస్కర్ తాను విద్యనభ్యసించిన చోటే ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. తదుపరి హైదరాబాద్‌లో ఉన్నత చదువులు బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా (ఎస్‌ఏ, సైన్స్)ఎంపికయ్యారు. రాజపేట మండలం రఘునాథపురం, యాదగిరిగుట్ట, ఆత్మకూర్, చందుపట్లలో పని చేశారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో భాగంగా వలిగొండ శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ప్రస్తుతం వలిగొండ మండల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణంగా ఇలాంటి అవకాశం కొందరికి మాత్రమే లభిస్తుంది.

✦ నాటి ఉపాధ్యాయులు పటిష్ఠమైన ప్రాథమిక, హైస్కూల్ విద్య అందించడంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి పని చేస్తున్నందుకు సంతోషంగా, గర్వంగా ఉందని చెబుతున్నారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో రాబోయే రోజుల్లో పాఠశాలలో విద్యార్థులను సంఖ్యతో పాటు పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రణాళికబద్ధంగా వ్యవహరించి మండలంలో సర్కార్ బడుల బలోపేతం చేసి జిల్లాలో ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో ఎస్.భాస్కర్ తెలిపారు. – న్యూస్‌టుడే, వలిగొండ



కేఎల్‌ఎన్ బాలుర కళాశాలలో రాంనగర్ బన్నీ సినిమా హీరో చంద్రహాస్, హీరోయిన్ విస్మయశ్రీ. చిత్ర బృందం

రాంనగర్ బన్నీ సందడి

వచ్చే నెల 4న విడుదల కానున్న 'రాంనగర్ బన్నీ' సినిమా బృందం శనివారం మిర్యాలగూడ పట్టణంలో సందడి చేసింది. కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరో చంద్రహాస్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచా జోషి, చిత్ర యూనిట్ పాల్గొన్నారు. చిత్రంలోని పలు సన్నివేశాల గురించి విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ మహత్, నిర్మాత మలయజ ప్రభాకర్, అంబికా వాణి, కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ

చిక్కింది.. బంగారు చేప

శాలిగౌరారం ప్రాజెక్టులో గాలంతో చేపలను పట్టేందుకు వెళ్లిన ఓ బాలుడికి బంగారు వర్ణం కలిగిన చేప చిక్కింది. ఏ చెరువులోనైనా పాంప్లేట్ చేప నల్ల వర్ణంలో ఉంటుంది. కానీ దానికి భిన్నంగా బంగారు వర్ణంలో ఉండడం అరుదని మత్స్యకారులు చెబుతున్నారు.



న్యూస్‌టుడే, శాలిగౌరారం

ప్రాణం పెట్టి.. పాఠం చెప్పేటోళ్లకు వందనం: డా.అందెశ్రీ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: నెలవారీ జీతాల కోసం కాకుండా, బడుగు జీవుల భవిష్యత్తు కోసం ప్రాణం పెట్టి పాఠం చెప్పే ఉపాధ్యాయులందరికీ దండం పెడతానని లోక కవి డా.అందెశ్రీ అన్నారు. విశిష్ఠ మహిళ, కీర్తి రత్న, ఉత్తమ పాఠ్య పుస్తక రచయిత డా.బండారు సుజాత శేఖర్ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా శనివారం హాజరై మాట్లాడారు. అక్షరాన్ని ఎవరు మడి కట్టుకుంటారో, తలపై ఇరుముడి కట్టుకుంటారో వాళ్లకు శరణాగతి చెప్తా నన్నారు. ప్రభుత్వ బడుల్లోకి వచ్చేది పిల్లలు కాదని, దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్లని తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కూరెళ్ల విఠలాచార్య సరస్వతి మాత చిత్రపటానికి పుష్పార్చన చేసి జ్యోతిని వెలిగించారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి, ఉద్యోగ విరమణ అనంతరం సమాజానికి సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో, రచయిత్రిగా బహుముఖ సేవలందించిన సుజాత అభినందనీయురాలని మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ స్కూల్ కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కర్నె శివకుమార్ అధ్యక్షత వహించారు. ఎస్సీఈఆర్టీ విశ్రాంత డైరెక్టర్ డా.కలపాల ఆనందకిశోర్, రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, 'ఐప్సో' రాష్ట్ర కన్వీనర్ కేవీఎల్, ప్రభాకర్, దేవేందర్, అయోధ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, మాధవరెడ్డి పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో డా.సుజాతశేఖర్ పదవీ విరమణ సన్మాన సభలో జ్యోతి వెలిగిస్తున్న లోక కవి అందెశ్రీ, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.కూరెళ్ల విఠలాచార్య, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ఎస్సీఈఆర్టీ విశ్రాంత డైరెక్టర్ డా.కలపాల ఆనందకిశోర్ తదితరులు

యువకుడి దారుణ హత్య

డిండి, న్యూస్‌టుడే: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన డిండి మండలం చెర్కుపల్లి గేటు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన శ్రీపతి జగదీష్(34)ని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చేతులు, కాళ్లను తాడుతో కట్టేసి.. నోరు, కళ్లను చున్నీతో చుట్టారు. అనంతరం బండరాళ్లతో తలపై కొట్టి హత్యచేసి చెర్కుపల్లిగేటు సమీపంలో చెట్ల పొదల్లో పడేశారు. సమీపంలోని రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా.. డీఎస్పీ గిరిబాబు, డిండి, చందంపేట, నేరెడుగొమ్ము ఎస్సైలు రాజు, సతీష్, సతీష్‌లు చేరుకొని ఘటనా స్థలిని పరిశీలించారు. హత్య చేసిన వ్యక్తులను గుర్తించేందుకు లభ్యమైన ఖాళీ బీరు సీసాలపై వేలి ముద్రలు సేకరించనున్నట్లు తెలిపారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. డిండి, దేవరకొండ ప్రధాన రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



డిండి: ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గిరిబాబు

ఎంజీయూ పీజీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పీజీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాల్లో 72శాతం ఉత్తీర్ణత, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్‌లో 56.27 శాతం, రెండో సెమిస్టర్‌లో 63.75 శాతం, మొదటి సెమిస్టర్‌లో 38.5శాతం ఉత్తీర్ణత సాధించారు. పూర్తి వివరాలను ఎంజీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఎంజీయూ ఓఎస్డీ కె.అంజిరెడ్డి, సీవోఈ ఉపేందర్‌రెడ్డి, సంధ్యారాణి, భిక్షమయ్య, పాల్గొన్నారు.



ఎంజీయూ పీజీ ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ అల్వాల రవి, తదితరులు

◆ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ కంట్రోలర్‌గా రామచందర్‌గౌడ్, కో- ఆర్డినేటర్‌గా డా.భిక్షమయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఆదేశాలు జారీ చేశారు.

వీర విజయం..!

◆ వయసు గడువుకు నెల ముందు దరఖాస్తు.. 48 ఏళ్లకు కొలువు



లాల్‌కోట వీరస్వామి

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబం.. ఆపై అడుగడుగునా అపజయాలతో నిరుత్సాహం.. అయినా పట్టువదలని ధీరత్వం.. చదువు పూర్తయిన 17 ఏళ్లకు.. అదీ ఉద్యోగ వయసు గడువుకు కేవలం నెల ముందు దరఖాస్తు చేసి.. 48 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించి యువతకు సవాల్ విసిరి.. అన్ని వర్గాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు మిర్యాలగూడ మోటారు వాహనాల తనిఖీ అధికారి లాల్‌కోట వీరస్వామి. ఆయన 'న్యూస్‌టుడే'తో తన జీవిత విశేషాలు వివరించారు.

వేసవి సెలవుల్లో కోళ్ల ఫారంలో..

మాది నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం కుర్మిద్ద. అమ్మానాన్న లాల్‌కోట కృష్ణయ్యగౌడ్, దేవమ్మ వ్యవసాయ కూలీలు. అమ్మ పాచి పని కూడా చేసేది. ప్రాథమిక విద్య గ్రామంలో, ఏడు, ఎనిమిది తరగతులు పక్క గ్రామంలో పూర్తి చేశాను. ఉన్నత విద్య కోసం ప్రభుత్వ వసతిగృహంలో చేరగా.. అక్కడి నాణ్యత లేని ఆహారం, వాతావరణంతో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఇక్కడ ఉండగానే వేసవి సెలవుల్లో కోళ్ల ఫారంలో కార్మికుడిగా పనికి వెళ్లేవాడిని. ఇంటర్ పూర్తయిన తర్వాత ఇక చదివించే స్థోమత లేకపోవడంతో. . అమ్మ ప్రోత్సాహంతో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి.. ప్రభుత్వ కళాశాలలో ఆటో మొబైల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఈ సమయంలో సెలవు రోజుల్లో హాస్టల్ లేక తిండి కోసం అనేక అవస్థలు పడ్డాను.

గల్ఫ్‌కి పయనం..

డిప్లొమా అనంతరం వివాహం.. కుటుంబ పోషణ కోసం చిన్న ఉద్యోగంలో చేరా. అనంతరం మిత్రుల సూచనతో దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఏజెన్సీ మోసంతో అత్తింటి వారు ఇచ్చిన డబ్బు పోగొట్టుకున్నా. మరోసారి ప్రయత్నించి.. సౌదీఅరేబియాకు వెళ్లా. ఆటోమొబైల్ రంగంలో కాకుండా బోర్‌వెల్ రంగంలో పని చేయాల్సి రావడంతో నిరుత్సాహానికి గురయ్యా. దీంతో మూడేళ్ల తర్వాత తిరిగి దేశానికి వచ్చి.. హైదరాబాద్‌లో మకాం పెట్టి.. ఓ కార్ల షోరూంలో సర్వీస్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించా. జీతం సరిపోకపోవడంతో మిత్రులతో కలిసి కార్ల మెకానిక్ షాప్ ప్రారంభించా.

❖ అది బాగానే ఉన్నా.. 2004లో ఏఎంవీఐ ఉద్యోగాల నోటిఫికేషన్ రావడంతో చదువు పూర్తయిన 17 ఏళ్లకు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేశా. ఇంటర్వ్యూతో పోయింది. 2009లో మళ్లీ దరఖాస్తు చేశా. అప్పటికి నా వయసు ప్రభుత్వం ఇచ్చిన కటాఫ్‌కు ఒక నెల మాత్రమే తక్కువ. పలుమార్లు వైద్య పరీక్షలు.. 2012లో ఇంటర్వ్యూలు జరిగాయి. ఎట్టకేలకు 48 ఏళ్ల వయసులో ప్రభుత్వ ఉద్యోగం సాధించా. మా బ్యాచ్‌లో నేనే ఎక్కువ వయసు వాడిని కాగా.. అతి తక్కువ వయసు నాలో సగం 24 ఏళ్ల వారూ ఉన్నారు.

❖ 'జీవితంలో ఎన్ని కష్టాలు, అవరోధాలు ఎదురైనా ప్రయత్నించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహానికి గురికావొద్దు. విజయం ఎప్పటికైనా సిద్ధిస్తుందనడానికి నా జీవితమే ఉదాహరణ'..అని ఆయన స్పష్టం చేశారు.

పల్లెవెలుగులో.. ప్రసవం

మునగాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో ఓ గర్భిణి ప్రసవించిన ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడువాయి స్టేజి వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండకు చెందిన శివవాసి అలివేలు.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వైద్యపరీక్షల నిమిత్తం వెళ్లి, స్వగ్రామానికి కోదాడ డిపోకి చెందిన ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తుండగా.. మార్గమధ్యలో తాడువాయి స్టేజి వద్దకు బస్సు చేరుకోగానే నొప్పులు వచ్చాయి. ఇది గుర్తించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును పక్కన నిలిపారు. సాధారణ ప్రసవం కావడంతో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. బస్సులో ఉన్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు ప్రథమ చికిత్సను నిర్వహించి తల్లి బిడ్డను జిల్లా జనరల్ వైద్యశాలకు తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ, అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.



తల్లీ బిడ్డలను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

సంతలో చోరీ చేసిన రూ.10.50 లక్షలు స్వాధీనం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట పశువుల సంతలో ఈ నెల 16న ఓ డీసీఎం వాహనం నుంచి రూ.10.50 లక్షలు చోరీ చేసిన ఇద్దరు నిందితులతోపాటు డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ ఠాణాలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన తాజుద్దీన్ అనే వ్యాపారి పశువుల కొనుగోలుకు తన వెంట తెచ్చుకున్న డబ్బును డీసీఎంలో ఉంచి జీవాల బేరం మాట్లాడేందుకు వెళ్లారు. తిరిగొచ్చి చూస్తే డబ్బు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారని భావించి బాధితుడు పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వాహన డ్రైవర్లు కోదాడకు చెందిన జావిద్, హయత్ అలీ ఆ డబ్బు దొంగిలించినట్లు గుర్తించారు. నిందితులిద్దరినీ శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సై కుశలవ, క్రైం సిబ్బంది కరుణాకర్, కృష్ణ, పాల్గొన్నారు.



సూర్యాపేటలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

17 నుంచి ఉర్సు

నీలగిరి, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా నిర్వహించే సయ్యద్ లతీఫ్ షా ఖాద్రీ ఉర్సు ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయిస్తామని పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దర్గా మెట్ల వద్ద శనివారం నిర్వహించిన ఉర్సు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాను దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. దర్గా పరిసరాలలో వసతులు కల్పించడం కోసం రూ.9 లక్షలు కేటాయించామని చెప్పారు. సమావేశంలో పురపాలిక వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, కౌన్సిలర్ నవీన్‌గౌడ్, సయ్యద్ సమద్, అలీ బాబ, మహబూబ్ అలీ, కొమ్ము శంకర్, సయ్యద్ హషం, సయ్యద్ జాఫర్, ఇంతియాజ్ హుసేన్, మసియొద్దీన్, ముతవలీలు సయ్యద్ రశీద్ ఖాద్రీ, గౌస్ ఖాద్రీ, సల్మాన్ ఖాద్రీ పాల్గొన్నారు.

సమన్వయంతో నీటిని వాడుకోవాలి

చిట్యాల, న్యూస్‌టుడే: పిల్లాయిపల్లి కాల్వ నీటి వాడకంపై ఉరుమడ్ల, చిన్నకాపర్తి రైతుల మధ్య పేచీ ఏర్పడింది. పెద్దకాపర్తి గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువులోకి పిలాయిపల్లి కాల్వ నీరు వచ్చి చేరుతోంది. ఈ చెరువు నుంచి ఉరుమడ్ల, చిన్నకాపర్తి ప్రాంతాలకు నీరు వెళ్లాల్సి ఉంది. చెరువు నుంచి బయటకు వస్తున్న నీటిని తమ గ్రామానికి వచ్చే కాల్వకు అడ్డుగా మట్టిపోసి ఉరుమడ్ల ప్రాంత రైతులు కొందరు వారి గ్రామానికి మళ్లించుకుంటున్నారని, దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరుతూ చిన్నకాపర్తి గ్రామ రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మరోవైపు తమ గ్రామానికి వచ్చే కాల్వకు అడ్డుగా పోయించిన మట్టికట్టను తొలగించాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు గ్రామాల రైతుల మధ్య చర్చలు జరిగాయి. విషయం నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి వెళ్లింది. ముందస్తుగా రైతులకు సమాచారం అందించి, పెద్దకాపర్తికి శనివారం నీటి పారుదల శాఖ చౌటుప్పల్ డివిజన్ (పిల్లాయిపల్లి కాల్వ) డిప్యూటీ ఈఈ కృష్ణారెడ్డి వచ్చారు. ఇరు గ్రామాల రైతులతో పెద్దకాపర్తి చెరువు నుంచి వచ్చే నీటి వాడకంపై చర్చించారు. వచ్చే నెల 5 వరకు ఉరుమడ్ల రైతులు, 5 నుంచి 10 రోజుల పాటు చిన్నకాపర్తి రైతులు, తిరిగి ఉరుమడ్ల రైతులు... ఇలా ఒక గ్రామం తర్వాత ఒక గ్రామ రైతులు నీటిని వాడుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు రైతులు గరిష్ఠంగా కాల్వ నీరు నెలన్నర వరకు రావచ్చని కృష్ణారెడ్డి పేర్కొన్నారు.



పెద్దకాపర్తి శివారులో పిల్లాయిపల్లి కాల్వ వద్ద గుమిగూడిన రైతులు

గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన

కనగల్, న్యూస్‌టుడే: కనగల్ గ్రామంలో నిర్మించనున్న బీసీ గురుకుల పాఠశాల స్థలాన్ని ఆర్డీవో శ్రీదేవి శనివారం పరిశీలించారు. సర్వే నెంబర్ 333లో పాఠశాలతో పాటు హాస్టల్ భవనం నిర్మించనున్నారు. సొంత భవనం లేక కనగల్ మండలానికి కేటాయించిన పాఠశాలను జిల్లా కేంద్రంలోని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పద్మ, నాయబ్ తహసీల్దార్ ఎన్.పార్వతమ్మ, సీనియర్ అసిస్టెంట్ విష్ణేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు సునీత, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో శ్రీదేవి

వారు నాటారు... వీరు నరికారు

నకిరేకల్, న్యూస్‌టుడే:

నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నీడనిచ్చే వృక్షాలను ఇటీవల నరికారు.. ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా 2016లో ఈ యార్డులో వెయ్యికిపైగా మొక్కలను మార్కెట్ అధికారులు నాటించి సంరక్షించడంతో నేడు యార్డులో పచ్చని వనాలు అభివృద్ధి చెందాయి. యార్డులో ఒక వైపు పురపాలికకు చెందిన ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో దాదాపు పది వృక్షాలను ఇటీవల నరికి వేయించారు. ఈ వృక్షాలతో ట్యాంకు వద్ద చెత్త పేరుకుంటుందని, పాములు తిరుగుతున్నాయని.. పురపాలిక నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఈ చెట్లను తొలగించినట్లు తెలిసింది. తొలగించిన చెట్ల కలపను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించినట్లు ప్రచారం ఉంది. చెట్ల కింద చెత్త పేరుకుంటే ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పాములు దరిచేరకుండా చర్యలు చేపట్టడానికి బదులుగా ఏపుగా ఎదిగిన పచ్చని నీడనిచ్చే వృక్షాలను మొదలుతో సహా నరకడంపై విమర్శలున్నాయి. చెట్లను నరికి కొమ్మలు, ఆకులు అక్కడే వదిలేయడంతో ఆ ప్రాంతంలో మరింతగా చెత్త పేరుకుని గతం కంటే తీవ్ర అపరిశుభ్రంగా మారడం గమనార్హం.



వ్యవసాయ మార్కెట్లో 2016లో అధికారులు ఇలా.. మొక్కలు నాటారు (పాత చిత్రం)



నకిరేకల్: వ్యవసాయ మార్కెట్లో వృక్షాల నరికివేత



నిబంధనలు ఇలా..

ప్రజా అవసరాల కోసం వృక్షాలను తొలగించాల్సి వస్తే ముందస్తుగా అటవీ శాఖకు ఒక్కో చెట్టుకు రూ.550 చొప్పున చలానా ద్వారా ఫీజు చెల్లించి అనుమతి తీసుకోవాలి. తొలగించిన ఒక్కో చెట్టుకు బదులుగా రెండు మొక్కలు నాటి మూడేళ్ల పాటు ఆ మొక్కలను పెంచి అటవీ శాఖ వారికి చూపించాల్సి ఉంటుంది. మార్కెట్ యార్డులో తొలగించిన వృక్షాలకు సంబంధించి తమ శాఖ నుంచి ఎన్‌వోసీని ఎవరూ తీసుకోలేదని అటవీ శాఖ సెక్షన్ అధికారి అశోక్‌రెడ్డి తెలిపారు. చెట్ల తొలగింపుపై సమాచారం ఇవ్వలేదని మార్కెట్ అధికారులు వివరించారు. ఈ అంశం తన దృష్టికి రాలేదని, వివరాలు తెలుసుకుంటానని నకిరేకల్ పుర కమిషనర్ డి.బాలయ్య చెప్పారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: అర్హులకు ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. నెల్లిబండలో పార్టీ గ్రామ శాఖ మహాసభలో శనివారం ఆమె మాట్లాడారు. రాచకొండ వెంకట్‌గౌడ్, వెంకట రంగారెడ్డి, లక్ష్మీ నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199, 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని పెద్దబండలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కానీ పక్కన కాల్వలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. కాల్వలు నిర్మించాలి. - శ్రీనివాస్, నల్గొండ.

✔ పరిశీలించి అవసరమైన నివారణ చర్యలు తీసుకుంటాం. - ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్ నల్గొండ పురపాలిక

పెట్రోలు బంకుల్లో తనిఖీలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: పెట్రోలు బంకుల్లో కనీస సౌకర్యాలు లేక వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై 'బంకుల్లో నిబంధనలు నామాలు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు సూచన మేరకు.. ఆయా శాఖ అధికారులు శనివారం చండూరు, మర్రిగూడ మండలాల పరిసర ప్రాంతాలలోని బంకుల్లో తనిఖీలు చేపట్టి సౌకర్యాలు పరిశీలించారు. ఈ నివేదికను డీఎస్‌వోకి, జేసీకి సమర్పిస్తున్నామని తెలిపారు. ఏఎస్‌వో రాజశేఖర్‌రెడ్డి, డీటీఎస్‌వో జోస్నశ్రీ, ఆర్ఐ సైదులు ఉన్నారు.

స్పందనకు వందనం

చెట్లకొమ్మల చెత్త తొలగింపు

చిట్యాల: 'రహదారిపై చెత్త కుప్పలు.. తొలగించకుండా నిర్లక్ష్యం' శీర్షికన ఈనాడులో ఈ నెల 25న ప్రచురితమైన కథనానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు స్పందించారు. జాతీయ రహదారిపై చిట్యాలలో చేపట్టనున్న పైవంతెన నిర్మాణంలో భాగంగా జాతీయ రహదారికి, సర్వీసుదారికి మధ్య పెంచిన కోనోకార్పస్ చెట్లను తొలగించారు. కాండంతో కూడిన మొద్దులను ఇక్కడ నుంచి తరలించారు. మిగిలిన కొమ్మల చెత్తను వదిలేశారు. దీనివల్ల ప్రజలకు ఎదురవుతున్న అసౌకర్యాన్ని వివరిస్తూ కథనంలో ప్రస్తావించగా పీడీ నాగేశ్వరరావు స్పందించి చెత్త తొలగింపునకు ఆదేశించారు. శనివారం చెత్త తొలగింపు ప్రారంభమైంది.



నకిరేకల్: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్

కేసులు సత్వర పరిష్కారం

నకిరేకల్, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ కోరారు. నకిరేకల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించి మాట్లాడారు. రాజీ మార్గాల ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇరువైపులా కక్షిదారులు గెలిచినట్లు అవుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 769 కేసులను పరిష్కరించి రూ.4.50 లక్షల జరిమానాలు విధించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



విజయవాడలో కనకదుర్గ ఆలయం ఎదుట అమ్మవారి జ్యోతితో మహారాష్ట్ర పాదయాత్ర బృందం

దుర్గమ్మ 'జ్యోతి'తో పాదయాత్రగా మహారాష్ట్రకు

చిట్యాల, న్యూస్‌టుడే: విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి 'జ్యోతి'ని తీసుకుని మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా షెట్‌పలే గ్రామానికి పాదయాత్రగా బయలుదేరిన 'సార్వజనిక్ దుర్గామాత నవరాత్రి ఉత్సవ్ మండల్' సభ్యుల బృందం శనివారం నల్గొండ జిల్లా చిట్యాలకు చేరుకుంది. 70 మంది సభ్యులతో కూడిన ఈ బృందం ఈ నెల 26న వాహనాల్లో తమ గ్రామం నుంచి బయలుదేరి కనకదుర్గ ఆలయానికి చేరుకున్నామని, అమ్మవారిని దర్శనం చేసుకుని ఆలయం నుంచి జ్యోతిని తీసుకుని పాదయాత్రగా తిరుగు ప్రయాణం అయ్యామని 'సార్వజనిక్ దుర్గామాత నవరాత్రి ఉత్సవ్ మండల్' అధ్యక్షుడు నారాయణ గైక్వాడ్, ఉపాధ్యక్షుడు ప్రమోద్ గైక్వాడ్ పేర్కొన్నారు.



శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్యే వీరేశానికి వీడ్కోలు పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు

విదేశీ పర్యటనకు ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, న్యూస్‌టుడే: పది రోజుల విదేశీ వ్యక్తిగత పర్యటన కోసం ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం ఉదయం లండన్‌కు వెళ్లారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్యేకు నకిరేకల్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, పుర కౌన్సిలర్లు సైదులు, రాచకొండ సునీల్, కొండయ్య, నరేందర్, శ్రీకాంత్, శ్రీను, సాయి పాల్గొన్నారు.

అక్టోబరు 2న మహాశాంతి ర్యాలీ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత సంవత్సరం అక్టోబరు 2న గాంధీ భవన్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే జీవో 317 సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదని ఆ జీవో బాధితులు తెలిపారు. హామీ ఇచ్చి సంవత్సరం కావస్తున్నందున దీనిని గుర్తు చేస్తూ అక్టోబరు 2న గాంధీ భవన్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు మహాశాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్గొండలోని ఎన్‌జి కళాశాలలో పలువురు 317 బాధితులు మహాశాంతి ర్యాలీ గోడపత్రికను విడుదల చేశారు. జె.క్రాంతికుమార్, బండి వినయ్‌కుమార్, గణేష్, సంతోష్, రాజశేఖర్ ఉన్నారు.

నవంబరు 3న తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు

నీలగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ సాహిత్యం సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం కోసం ఏర్పడిన తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలను నవంబరు 3న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య తెలిపారు. ఎన్జీ కళాశాల మైదానంలో శనివారం కవులు రచయితలతో కలిసి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కవితలు రాసిన విద్యార్థులు అక్టోబరు 20 వరకు **9848228004** నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. కుకుడాల గోవర్ధన్, మహ్మద్ హసేన, ఆనంద్, సత్తయ్య పాల్గొన్నారు.

ధరల అదుపులో కేంద్రం విఫలం

చిట్యాల, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. చిట్యాల పుర పరిధి శివనేనిగూడెంలో శనివారం జరిగిన తమ పార్టీ గ్రామ శాఖ మహాసభకు వీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిట్ట నగేశ్, శంకరయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: మాడ్గులపల్లి ఎస్సైగా యస్.కృష్ణయ్య శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్సై శోభన్‌బాబు వీఆర్‌కు అటాచ్ కాగా, మిర్యాలగూడ టూటౌన్ ఎస్సైగా ఉన్న కృష్ణయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు.



ఎస్సై కృష్ణయ్య

పుర కార్మికులకు వేతనాలు పెంచాలని వినతి

చిట్యాల, న్యూస్‌టుడే: పురపాలికలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకుని వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పుర ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కమిషనర్ వీరేందర్‌కు నగేశ్ శనివారం వినతిపత్రం అందజేశారు. బాకి అండాలు, పాల వరలక్ష్మి, కవిత, లక్ష్మయ్య, దుర్గేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

సాయి చతుర్ముఖ విగ్రహావిష్కరణ

చిట్యాల, న్యూస్‌టుడే: షిరిడీ సాయి జయంతిని పురస్కరించుకుని వట్టిమర్తి శివారులోని సాయిబాబా ఆలయంలో వేడుకలు శనివారం కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు ఇమ్మడి రమేశ్, బత్తుల ఊషయ్య, ఇమ్మడి వెంకటేశ్వర్లు, ఉప్పల కోటయ్య, వడ్డగాని నరసింహ సమకూర్చిన సాయి చతుర్ముఖ విగ్రహాన్ని భక్తుల సమక్షంలో ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: భవిష్యత్తు తరాలకు అభివృద్ధి ఫలాలు అందించేలా పట్టణ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని నల్గొండ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో శనివారం ఛైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో కొత్త భవన నిర్మాణాలకు ఆస్తి పన్ను మదింపు చేపట్టి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ఖయ్యుంబేగ్ అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడారు. పట్టణంలో 180 కి.మీ మేర యూజీడీ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పట్టణ అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ప్రభుత్వం రూ.235 కోట్ల ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ అనుమతి తెలిపిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్, వైస్ ఛైర్మన్ రమేష్‌గౌడ్, ఈఈ రాములు, అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో కమిషనర్ ముసాబ్ అహ్మద్, వైస్ ఛైర్మన్ రమేష్‌గౌడ్

పరిశుభ్రత అలవర్చుకోవాలి

తిప్పర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని నెహ్రూ యువజన కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్ సింగ్ అన్నారు. తిప్పర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు నరసింహా నాయక్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జయంతి

మర్రిగూడ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, బూడిద సురేష్, మహేందర్, గిరి, నిరంజన్‌ఉన్నారు.

కట్టంగూరు: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రవీందర్, శంకర్, నిఖిల్, వంశి, కిరణ్ పాల్గొన్నారు.

నాంపల్లి: భగత్‌సింగ్ జయంతి వేడుకలను విద్యార్థులతో కలిసి శనివారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

కార్మికుల పాత్ర కీలకం

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: పట్టణ పరిశుభ్రతలో మున్సిపల్ కార్మికులదే కీలక పాత్ర అని మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సామగ్రి నిల్వ కేంద్రం వద్ద మున్సిపల్ కార్మికులకు శనివారం భద్రతా పరికరాలను అందచేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిప్పర్తి: సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో వ్యవహరించాలి

తిప్పర్తి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సర్పంచులు అధికారంలో లేని దృష్ట్యా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. తిప్పర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం తిప్పర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైన తిప్పర్తి పాఠశాలలో ప్రస్తుత పరిస్థితులను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో జానయ్య, మండల పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయుడు నరసింహా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు మానుకోవాలి

మునుగోడు, న్యూస్‌టుడే: మునుగోడులోని సర్వే నెంబరు 78లో గత 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న బుడిగ జంగాల గుడిసెలను తొలగించేందుకు ఆర్డీవో, తహసీల్దారు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బాధిత బుడిగ జంగాలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిర్పారి వెంకటేశ్వర్లు, శంకర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో తాజాగా నల్గొండ కేపీఎం ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ఎన్జీ కళాశాల విద్యార్థిని నర్మద సింగింగ్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. ఆ విద్యార్థినిని శనివారం కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్ అభినందించారు. కళాశాల కల్చరల్ కో ఆర్డినేటర్ డా.వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు భాగ్యలక్ష్మి, మల్లేశం, వెంకట్‌రెడ్డి, కోటయ్య, శివరాణి, సావిత్రి, సైదులు, లింగస్వామి, అంజయ్య పాల్గొన్నారు.



కళాశాల విద్యార్థిని నర్మదను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు

స్వచ్ఛమైన తాగునీరు అందించేలా కృషి

కనగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శాంతా కుమారి పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి సరఫరా చేసే నీటి సహాయకులకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు ప్రారంభించి ఆయన మాట్లాడారు. నీటి నాణ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. డీఈలు సంపత్, రవి, ఎంపీడీవో టి. జయరామ్, ఏఈలు షఫీయుద్దీన్, పంకజ్, మీనా పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **పీవీఎన్:** దేవర, **వెంకటేశ్వర:** దేవర

నకిరేకల్: **రామకృష్ణ-** సత్యం సుందరం, **వెంకటేశ్వర-** దేవర

సంక్షిప్త సమాచారం

రక్తదానంతో ప్రాణాలు నిలబెట్టొచ్చు... చిట్యాల: ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తులకు రక్తదానం ద్వారా వారి ప్రాణాలు నిలబెట్టొచ్చని నార్కట్‌పల్లి సీఐ నాగరాజు అన్నారు. సర్దార్ భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని చిట్యాలలో శనివారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ, మాతృదేవోభవ, పితృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. పురఛైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షుడు మారగోని ఆంజనేయులు, మేడి హరికృష్ణ పాల్గొన్నారు.

నీటి సరఫరాపై శిక్షణా తరగతులు ... నాంపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో తాగు నీటి సరఫరాపై (వాటర్ మెన్స్) సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో శనివారం శిక్షణా తరగతులు ప్రారంభించారు. తాగు నీటి పైపులైన్ల బిగింపు, లీకేజీల గుర్తింపు, సరఫరాలో ఇబ్బందులు, పరిశీలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ముజీబొద్దీన్, ఏఈ రామచంద్రయ్య, ఎంపీవో ఝాన్సీ పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం కార్యక్రమం... నార్కట్‌పల్లి గ్రామీణం: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల నల్గొండ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా చెర్వుగట్టులో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి, మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ అపర్ణ, సుల్తానా, ప్రిన్సిపల్ వాణి పాల్గొన్నారు.

పంపిణీ... నార్కట్‌పల్లి గ్రామీణం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చామల రమాదేవి తెలిపారు. నక్కలపల్లిలోని జడ్పీ ఉన్న పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.3 లక్షల విలువగల ల్యాప్‌టాప్స్, క్రీడా సామగ్రి, క్రీడా దుస్తువులు, పుస్తకాలు, బ్యాగులు, చెప్పులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు సింగర రాంమూర్తి, పీఆర్టీయూటీజీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవిబాబు, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం... కనగల్: పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గంలో మండల ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి సైదిరెడ్డి తెలిపారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్. మురళి మోహన్‌రెడ్డి(పీఎస్ మార్తినేనిగూడెం), కె.ప్రభాకర్ (ఉన్నత పాఠశాల, దొరేపల్లి) , ఉపాధ్యక్షులుగా కె.వీ కిషన్‌రావు (ఉన్నత పాఠశాల జి.యడవల్లి), ఎ.శ్రీనివాస్ (ఆదర్శ పాఠశాల), జిల్లా కార్యదర్శిగా ఎండీ ఎజాజ్ (ఉన్నత పాఠశాల, చిన్నమాదారం), జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రామకృష్ణమ్మ (యూపీఎస్, పగిడిమర్రి), మండల కార్యదర్శిగా ధర్మేందర్‌రెడ్డి (ఉన్నత పాఠశాల, చర్లగౌరారం) ఎంపికైనట్లు ఆయన తెలిపారు. మండల కార్యదర్శి కేశవులు, రామకృష్ణారెడ్డి, మురళి, వెంకటేశం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి...కేతేపల్లి: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె శివయ్య చెప్పారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన శివయ్యను శనివారం మండలంలోని భీమారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు కె.భిక్షమయ్య, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.పరమేశ్, నాయకులు ఉన్నారు.

నిరసన... నల్గొండ విద్యావిభాగం: రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా ఉన్న జీవో నెంబర్ 25ను సవరించి బోధనకు ఆటంకం లేకుండా సవరణ ఉత్తర్వులు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో శనివారం నల్గొండలోని పెద్ద గడియారం సెంటర్లో జీవో నెంబర్ 25ను రద్దు చేయాలని కోరుతూ శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూఎస్‌పీసీ నాయకులు ఎడ్ల సైదులు, రత్తయ్య, ఎండీ.ఖుర్షిద్ మియా, వెంకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి.. కనగల్: ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. జి.యడవల్లి గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ప్రభావతి, లింగస్వామి, సుల్తానా, అక్రమ్, కొర్వి భిక్షం పాల్గొన్నారు.

నిస్వార్థంగా పని చేసిన వారికి గుర్తింపు.. కేతేపల్లి: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పని చేసిన రాజకీయ నాయకులకు ఎల్లప్పుడు ప్రజల హృదయాలలో తగిన గుర్తింపు, ఆదరణ ఉంటుందని టీపీసీసీ పూర్వ కార్యదర్శి దైదా రవీందర్ చెప్పారు. తుంగతుర్తిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుడపూరి రోశయ్య సంతాప సభ సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ సర్పంచి పాల్వాయి వెంకటయ్య, ఎల్.పెద్ద వెంకన్న, పి.విద్యాసాగర్, కె.అశోక్, కె.కృష్ణ, ఎం.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాల లక్ష్యం...నకిరేకల్: తెలంగాణలో లక్ష మంది మహిళలను సభ్యులుగా చేర్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల సుకన్య చెప్పారు. నకిరేకల్ పురపాలిక పరిధిలోని 12వ వార్డులో మహిళా కాంగ్రెస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శనివారం మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ గొలుసు అపహరణ


నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ముశంపల్లి రోడ్డులో మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసు అపహరించినట్లు వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన గడ్డం కమలమ్మ పట్టణంలోని మారుతీ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న తన కూతురు వద్దకు రెండు రోజుల క్రితం వచ్చింది. సమీపంలోని కిరాణం షాపులో శుక్రవారం రాత్రి వస్తువులు తేవడానికి వెళ్లి వస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఒక దుండగుడు ఆమె మెడలో ఉన్న గొలుసును ఎత్తుకెళ్లాడు. బంధువుల సహకారంతో శనివారం ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిప్పర్తి, న్యూస్‌టుడే: తిప్పర్తి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిప్పర్తి-నకిరేకల్ రహదారిపై డి-40 ప్రధాన కాల్వ వద్ద గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. తిప్పర్తి శివారులోని డి-40 కాల్వ వద్ద రోడ్డు ప్రమాద ఘటనలో తలకు, ఛాతికి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉండటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూడగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిప్పర్తి పంచాయతీ కార్యదర్శి నరసింహ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై జమాల్ తెలిపారు.

మాల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కన్నుమూత

నాంపల్లి, న్యూస్‌టుడే: నాంపల్లి మండలకేంద్రానికి చెందిన మాల్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కర్నాటి రామలింగం(73) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వ హయాంలో మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, నాంపల్లి జడ్పీటీసీ సభ్యుడిగా, భద్రాచలం దేవస్థాన కమిటీ సభ్యుడిగా పనిచేశారు. మృదు స్వభావి అయిన ఆయన రాజకీయాల్లో వివాదరహితుడిగా మండలంలో మంచి పేరు గడించారు. ఆయన మృతదేహానికి కాంగ్రెస్, భారాస, భాజపా, తెదేపా, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



కర్నాటి రామలింగం

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

క్షేత్ర పర్యటనతో.. విజ్ఞానం



క్షేత్ర పర్యటనకు వెళ్తున్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థులలో విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈవో, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగేశ్వరరావు అన్నారు. శనివారం పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా కొండమల్లేపల్లిలో గల 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, పీఏపల్లి మండలం కోదండాపురం వద్ద గల నీటి శుద్ధి కేంద్రాలను సందర్శించారు.

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలో మురుగుకాల్వలు శిథిలావస్థలో ఉండడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ చేపట్టాలి.
– ఆర్.జానకిరాములు, దేవరకొండ

✔ కొన్ని వార్డుల్లో ఇప్పటికే ఫాగింగ్‌ను పూర్తి చేశాం. మిగతా చోట్ల చేపడతాం.
– భాస్కర్‌రెడ్డి, పురపాలిక కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం,న్యూస్‌టుడే:

? పట్టణంలోని గాంధీనగర్‌లో నాగార్జున థియేటర్ ఎదురు వీధిలో వ్యర్థాలు భారీగా పేరుకుపోయి.. రోడ్డు నిరుపయోగంగా మారింది – నరేష్, మిర్యాలగూడ

✔ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

పార్టీకి తీరని లోటు: జానారెడ్డి



బట్టుగూడెంలో అచ్చిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

పెద్దవూర, న్యూస్‌టుడే: మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చెన్ను అచ్చిరెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. శనివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వినతి.. నాగార్జునసాగర్: మోప్మా ఆర్పీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర నాయకులు సీఎల్పీ మాజీ నేత జానారెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ.. మోప్మాలో పుర సంఘం పరిధిలో ఆర్పీలు 2007 నుంచి పనిచేస్తున్నారని, అప్పటినుంచి వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జానారెడ్డి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గులాబీ, నాగమణి, దుర్గా, రత్నకుమారి తదితరులున్నారు.

మల్లయ్య సేవలు మరువలేనివి



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, తదితరులు

చింతపల్లి: బూర్గు మల్లయ్య సేవలు మరువలేనివని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. పెద్దమల్లయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాసాగర్, శ్రీశైలంగౌడ్, గోవర్ధన్‌చారి, పాపయ్య, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా..
పట్టించుకోరా?

హాలియా పట్టణం మిర్యాలగూడ రోడ్డుపై వరుసగా ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నప్పటికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాలియా నుంచి ఇబ్రహీంపేట స్టేజీ వరకు కొందరు మృతి చెందగా మరికొందరు కాళ్లు, చేతులు విరిగి గాయాలపాలయ్యారు. పట్టణంలో 565, 167 జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా ఇప్పటివరకు విభాగినిలను ఏర్పాటు చేయకపోవడంతో నిరంతరం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – హాలియా, న్యూస్‌టుడే



హాలియా పట్టణంలో ప్రమాదకరమైన మూలమలుపు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గోవులు (పాత చిత్రం)

మచ్చుకు కొన్ని..

- పనులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్న హమాలీ షేక్ మహబెల్లి ఇబ్రహీంపేట స్టేజీ వద్ద లారీ ఢీకొట్టడంతో మృతి చెందారు.
- లింగాల సత్యం ఒక రైస్ మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ విధులు ముగించుకుని రాత్రి సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా ఇబ్రహీంపేట స్టేజీ వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మృతి చెందారు.
- హాలియా మిర్యాలగూడ రోడ్డులో ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో హజారిగూడెం గ్రామానికి చెందిన షేక్ చాంద్‌పాషా కాలు విరిగి మంచానికే పరిమితమయ్యారు.
- హాలియా మిర్యాలగూడ రోడ్డు మహీంద్రా ట్రాక్టర్ షోరూం వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో పట్టణానికి చెందిన ద్విచక్రవాహనదారులు శివ, శంకర్ తీవ్రగాయాలయ్యాయి.
- మిర్యాలగూడ రోడ్డులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్ద రాత్రి సమయంలో డీసీఎం వాహనం విభాగినిని ఢీకొనగా.. ఆరు ఆవులు మృతి చెందాయి.
- మిర్యాలగూడ రోడ్డులో కారు, ద్విచక్రవాహనం ఢీ ఘటనలో పట్టణానికి చెందిన వెంకన్న, కోటేష్, గోపాల్ తీవ్ర గాయాలతో నెలల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం

– సతీష్‌రెడ్డి, ఎస్సై, హాలియా

హాలియా పట్టణం మిర్యాలగూడ రోడ్డులో జాతీయ రహదారుల విస్తరణ పూర్తిస్థాయిలో కాకపోవటంతో ఇప్పటి వరకు విభాగినిలను ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిపై ఇప్పుడే వందలాది వాహనాలు పట్టణం నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో విభాగిని ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

సత్వర న్యాయానికే లోక్ అదాలత్

మిర్యాలగూడ లీగల్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించి కక్షిదారులకు సత్వర, సమాన న్యాయం అందించేందుకే లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షుడు, ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించి మాట్లాడారు. మొత్తం 687 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణలత, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీదేవి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సకినాల వేలాద్రి, లింగంపల్లి శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి వేణు

మిర్యాలగూడ పట్టణం: లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టుకు వచ్చిన కక్షిదారులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర, నీళ్ల సీసాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగయ్య, బీఎం నాయుడు, కర్నాటి రమేష్, బాల శ్రీనివాస్‌నాయుడు, మాధవరెడ్డి, గోపాలకృష్ణ, సాధినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

210 మందికి జరిమానా, 30 కేసుల పరిష్కారం

నిడమనూరు, న్యూస్‌టుడే: నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. కోర్టు పరిధిలోని పోలీసు స్టేషన్లలో ఇటీవల డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 210 మందికి కలిపి కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి బీఎస్ఎన్ సుమబాల రూ.2,76,100లను జరిమానా విధించారు. 30 కేసులకు సంబంధించిన కక్షిదారులు ఆమె సమక్షంలో రాజీపడినట్లు కోర్టు కానిస్టేబుల్ అలీఅహ్మద్ తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంసీ.కోటిరెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఉస్మాన్ చిన వీరయ్య, న్యాయవాదులు పొదిళ్ల శ్రీను, నాగరాజు, వినోద్, బీఎస్ఎన్ రాజు, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల కవి జాషువా



మిర్యాలగూడ: జాషువా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

దేవరకొండ, న్యూస్‌టుడే: గుర్రం జాషువా జయంతిని ప్రజాసంఘాలు, ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, జగన్, సహదేవుడు, భాస్కరాచారి, సైదులు వెంకటాచారి, ఎల్లేష్ తదితరులున్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాషువా జయంతిని నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ సాంస్కృతిక రాష్ట్ర కన్వీనర్ నర్సింహా ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో అంజయ్య, పాల్గొన్నారు.

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని జప్తీవీరప్పగూడెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోటయ్య, దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, చంద్రకళ, రవి పాల్గొన్నారు.

హాలియా: హాలియా జడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో గుండా కృష్ణమూర్తి పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ప్రకాష్, పీఆర్టీయూ, యూటీఎఫ్, తపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైదులురావుగౌతమ్, మధు, వెంకటరెడ్డి, రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.



దేవరకొండలో.. ప్రజాసంఘాల నాయకులు



హాలియా జడ్పీ ఉన్నత పాఠశాలలో..

భగత్‌సింగ్ త్యాగం యువతకి స్ఫూర్తి



దేవరకొండలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్‌సింగ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని ఏఐవైఎఫ్, సీపీఐ జిల్లా నాయకులు లింగానాయక్, బంటు వెంకటేశ్వర్లు అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం మిర్యాలగూడలోని ప్రాంతీయ వైద్యశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సయీద్, వల్లంపట్ల వెంకన్న, కనకయ్య, శంకర్, రాంబాబు, శివ, కాంతమ్మ, రవళి పాల్గొన్నారు.

☛ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీ బాలికల వసతిగృహంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సైదా, వదూద్, నుమాన్, వీరన్న, ఉపేందర్, అనిల్, గాయత్రి, మమత, మధులత, ఇందు, భవాని పాల్గొన్నారు.

☛ పట్టణంలోని నేతాజీ పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస్, మురళీయాదవ్, జయరాజు, భీమ్లానాయక్, నూరి, అలివేలు, సునిత, కల్యాణి, నందిని పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

మిర్యాలగూడ: స్థానిక నేతాజీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్ జయరాజు, మురళీ, భీమ్లా, అలివేలు, సునిత, కల్యాణి పాల్గొన్నారు.



మిర్యాలగూడలో.. ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు



మిర్యాలగూడలో.. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

చింతపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద యువకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

దేవరకొండ: దేవరకొండ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వలమాల ఆంజనేయులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీహాస్టల్‌లో సౌభాన్, రాజేష్, రాజు, వినోద్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని యాద్గార్‌పల్లిలో ప్రజాతంత్ర యువజన, విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐఎఫ్‌డీవై జిల్లా అధ్యక్షుడు వస్కుల కిరణ్, ఏఐఎఫ్‌డీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పోతుగంటి కాశి, వస్కుల భరత్, అనుక్, మహేష్, ప్రశాంత్, హరీష్, మురళి, వినయ్ పాల్గొన్నారు.

పెద్దవూర: మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామావత్ శోభన్‌బాబు, తదితరులు నివాళులు అర్పించారు.

కదలని నీరు.. దాటలేని తీరు..!

కొండమల్లేపల్లి, దేవరకొండ, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వెళ్లేదారిలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. నిత్యం సుమారు 1200 మంది విద్యార్థులతో పాటు బీసీ, ఎస్సీ కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను వీలైనంత తొందరగా పరిష్కరించాలని విద్యార్థులు ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రాంరెడ్డిని వివరణ కోరగా సమస్య మా దృష్టికి వచ్చిందని రెండు రోజుల్లో అక్కడ మట్టిపోయించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.





రెవెన్యూ బృందాలతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ

సర్వే భూముల పరిశీలన

తిరుమలగిరి సాగర్: మండలంలో సర్వే చేస్తున్న ప్రభుత్వ, అటవీ, కాందిశీకుల భూములను జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ శనివారం పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద సర్వే చేస్తున్న సర్వే నంబరు 12, 14, 28, 60, 222లలోని భూములకు కాస్తు కబ్జాలో ఉన్న రైతులందరికి పట్టాలు అందజేస్తామన్నారు. రెవెన్యూ బృందాలతో చర్చించి సర్వే చేయని నంబరులో ఎంజాయిమెంట్ సర్వే చేయాలని అధికారులకు సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ సుబ్రహ్మణ్యం, ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్, డీఐ రమణయ్య, మేరావత్ మునినాయక్, శ్రీను, పరమేష్ తదితరులున్నారు.

సర్కారు బడుల అభివృద్ధికి కృషి: ఎంపీ

నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నల్గొండ పట్టణం ఎస్ఎల్‌బీసీలోని అనుముల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏకే ఫౌండేషన్ ఛైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యాధన్ ఫౌండేషన్, అచోరన్ కంపెనీ సహకారంతో రూ.3 లక్షల విలువైన బీరువా, పుస్తకాలు, టేబుళ్లు, ఛైర్స్, స్పోర్ట్స్ కిట్, 20 ఉపాధ్యాయుల ఛైర్స్, 20 క్లాస్ రూమ్ బోర్డ్స్, స్పీకర్స్, మెడికల్ కిట్స్‌తో కూడిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. విద్యాధన్ ఫౌండర్ ఈదర లక్ష్మీప్రసన్న, సభ్యులు హరిత, రమేష్, శిల, ప్రిన్సిపల్ రవి, ఉపాధ్యాయ బృందం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, రమేష్, సైదులుయాదవ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, హాలియా



పాఠశాలలో భోజనం చేస్తూ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చింతపల్లి, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పి.శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో జ్వరాలతో చికిత్స పొందుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, మండల వైద్యాధికారులు శ్రీదేవి, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.



హజ్రత్ ఖాదర్ మస్తాన్ షావలీ ఉర్సు

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న హజ్రత్ ఖాదర్ మస్తాన్ షావలీ దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. ముస్లింలు గంధం ఊరేగింపు చేపట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సత్తార్, ఆసిఫ్, మంజూర్, జహీర్, యాకుబ్, అజీం, రఫీ తదితరలున్నారు.

కొలువుదీరిన మాల్ మార్కెట్ పాలకవర్గం



చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాల్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరనుంది. ఛైర్‌పర్సన్‌గా మండలంలోని వింజమూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు **దొంతం అలివేలు**, వైస్ ఛైర్మన్‌గా నక్క శ్రీను, సభ్యులుగా గౌని జంగయ్య, రమావత్ హన్‌మాన్, ఎండి ముశ్వర్, జమ్ముల వెంకటయ్య, గంట మల్లయ్య, రమావత్ రమేష్, అంజాచారి, కందిశెట్టి వెంకటయ్య, మమత, పూల యాదగిరి, మేకల జగన్‌రెడ్డి, పురె శ్రీనివాస్‌లను నియామకం చేస్తూ సంబంధిత ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

విధేయతకు పట్టం..



భర్త మాధవరెడ్డితో జమున

దేవరకొండ: దేవరకొండ వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్‌గా నాయిని జమునని నియమిస్తూ శనివారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాయిని మాధవరెడ్డి సతీమణి. వైస్‌ఛైర్మన్‌గా తగుల్ల సర్వయ్య, డైరెక్టర్లుగా దేప సుదర్శన్‌రెడ్డి, మాధవరం గోవర్ధన్‌రావు, పగిడిమర్రి రఘురాములు, పెద్దిశెట్టి సుధాకర్, భూతం సైదులు, ఎస్.డి.దస్తగిరి, నేనావత్ కేశ్యానాయక్, థావుర్య, దీప, రాంబాబు, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా జాల నర్సింహారెడ్డి నియామకమయ్యారు.

అవీ ఇవీ

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి.. దేవరకొండ: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ పట్టణంలో గాంధీ నగర శాఖ మహాసభ సీపీఎం కార్యాలయంలో జరిగింది. నల్ల వెంకటయ్య, లింగయ్య, యాదగిరి, వెంకటేశం, ఇక్బాల్, లింగం, నర్సింహ, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం.. మిర్యాలగూడ పట్టణం: వివిధ మరమ్మతు పనుల నేపథ్యంలో మిర్యాలగూడలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి వెంట హనుమాన్‌పేట ఫైవంతెన నుంచి లలిత బంగారం షాప్ వరకు ఒక వైపున, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు రెండో పట్టణ ఏఈ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత నేత్రశిబిరం.. నిడమనూరు: మండలంలోని బొక్కమంతలపహాడ్‌లో ఆ గ్రామానికి చెందిన పుట్టా శేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వారు నిర్వహించిన ఉచిత నేత్రవైద్య శిబిరానికి మంచి స్పందన వస్తుందని నిర్వాహకులు యడవెల్లి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం వంద మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారని పేర్కొన్నారు.

వైద్య పరీక్షలు.. త్రిపురారం: స్వచ్ఛతసేవా కార్యక్రమంలో భాగంగా శనివారం త్రిపురారం గ్రామ పంచాయతీ కార్మికులకు డాక్టర్ శంకర్‌నాయక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్టోబరు 2 వరకు గ్రామ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎంపీకి వినతి.. హాలియా: జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సంఘం సభ్యులు ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సతీష్‌కుమార్, రాజు, వినోద్, లోకనాథం, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుర అధ్యక్షుడి జన్మదినం.. మిర్యాలగూడ: మిర్యాలగూడ పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ జన్మదిన వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీసీ ఐకాస ప్రతినిధులు కేకు కోయించి అందరికి పంపిణీ చేశారు. జయరాజు, మురళీ యాదవ్, ఖాదర్, అమృతం సత్యం తదితరులున్నారు.

దుస్తుల పంపిణీ.. నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన మంచికంటి శ్రీనివాసు స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు దుస్తులను పంపిణీ చేశారు.

బదిలీ.. సన్మానం.. త్రిపురారం: మండల విద్యాధికారిగా పని చేసి బదిలీపై దామరచర్లకు వెళ్లిన బాలాజీనాయక్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. నూతన ఎంఈవో రవి, సలీం, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఎంఈవో నిరుడు అంజయ్యను సన్మానించారు. సత్యనారాయణ, ఏడుకొండల్, యాదగిరి, శ్రీరాములు, నారాయణ, దేవకుమార్, సుందరయ్య, పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. దేవరకొండ: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని దేవరకొండ ఎంకేఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవినాయక్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలో మొక్కలు నాటారు.

నూతన కమిటీ ఎన్నిక.. కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల బంజార బావోజీల సంఘం నూతన కమిటీని మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చందు బావోజీ, ప్రధాన కార్యదర్శిగా రవిబావోజీ, కోశాధికారిగా బాలు బావోజీలను ఎన్నుకున్నారు.

గుర్రంపోడు: పీఆర్టీయూ టీఎస్ నల్గొండ జిల్లా కార్యదర్శిగా పిట్టలగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అద్దంకి సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్, గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో తన ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు.

